క్లుప్తంగా

త్రిదండి చినజీయర్‌స్వామికి ఆహ్వానం



చినజీయర్ స్వామిని ఆహ్వానిస్తున్న ఇస్కాన్ మాతాజీ నితాయ్ సేవిని

డాబాగార్డెన్స్: గీతామృత ప్రవచనాలకు విశాఖ విచ్చేసిన త్రిదండి చినజీయర్ స్వామిని ఇస్కాన్ మాతాజీ నితాయ్ సేవిని కలిసి ఈ నెల 11న గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్న గీతా జయంతి ఉత్సవాలకు ఆహ్వానం అందజేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంస్థ ప్రతినిధులు వంశీకృష్ణ, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్: అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జీఎంఆర్ నెహ్రూ సారథ్యంలో శనివారం సాయంత్రం శ్రీదేవి మహానటి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో 'నీవు లేక వీణ' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో పి. రాజేంద్రప్రసాద్, టీఎల్ ప్రసాద్, ఎస్ఎస్ఎన్ రాజు పాల్గొన్న ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు అమ్మాజీ రావు, మురళీయాదవ్, కందర్ప రాధ, ఉమాదేవి, రమణి, రూపవాణి తదితరులు వివిధ తెలుగు చలన చిత్రాల గీతాలు ఆలపించి మన్ననలు పొందారు.

ఘనంగా శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి



శివనాగ ప్రతిష్ఠపూర్వక శ్రీ సుబ్రహ్మణ్యస్వామి

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకుడు బులుసు సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జెండా చెట్టు వీధిలో వెలసిన శివనాగ ప్రతిష్ఠ పూర్వక శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం చేపట్టిన అన్నప్రసాద వితరణలో భక్తులు ప్రసాదం స్వీకరించారు. హోమ మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, పుణ్యాహవచనం, పూర్ణాహుతి కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

భూమి కేటాయింపునకు రంగం సిద్ధం

అల్లిపురం: తాటిచెట్లపాలేనికి చెందిన స్థల యజమానులు 2005లో గృహ నిర్మాణ శాఖకు తమ 84 సెంట్ల స్థలాన్ని ఇవ్వటంతో వారికి ముడసర్లోవలో సుమారు రూ.60 కోట్ల విలువ గల 1.54 సెంట్ల స్థలాన్ని కేటాయించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు ఎస్సీ కమిషనర్ మౌఖిక ఆదేశాలు జారీ చేసిన మేరకు అధికారులు ఈ నెల 11న జరగనున్న కౌన్సిల్ అజెండాలో ఈ అంశం చేర్చినట్లు తెలుస్తోంది. దీనికి పాలకవర్గ సభ్యులు అంగీకరిస్తారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. 2005లో గృహనిర్మాణ శాఖ స్థల యజమానుల నుంచి స్థలం తీసుకుని, ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించకపోవటంతో స్థల యజమానులు ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

చెరిగిపోని సంతకం

- జగనన్న బాటలోనే కూటమి ప్రభుత్వం
- అవే సచివాలయాలు, అవే రేషన్ వాహనాలు
- పారిశుధ్య నిర్వహణకు ఆ క్లాప్ వాహనాలే వినియోగం
- బాబు ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా పాత పద్ధతే

'ఏమే సుబ్బలక్ష్మీ.. రేషన్ బండి వచ్చిందా? రేషన్ తీసుకోవాలి..'
'వచ్చింది కానీ కొన్ని సరుకులే ఇత్తన్నారు..'
'వలంటీర్లు ఉన్నప్పుడే నయం అందరికీ రేషన్ అందేలా చూసేవారు. ఇప్పుడు ఏ సంగతీ తెలియడంలేదు. జగనే నయం ఏది చేసినా చెప్పి చేసేవాడు'
ఇది రేషన్ బండ్లపై ప్రస్తుతం నడుస్తున్న కామెంట్.

'ఏమేవ్ చెత్త బండి వచ్చింది.. చెత్త ఉంటే వారికి ఇచ్చేయ్..'
'రెండు రోజులుగా రావటం లేదు.. ఈ రోజే బయట పారేశాను..'
'గతంలోనే నయం ప్రతి రోజు వచ్చేవారు..' ఇది క్లాప్ వాహనాలపై జనాల కామెంట్



తడి పొడి చెత్త తరలిస్తున్న క్లాప్ వాహనం





వృద్ధునికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ సెక్రటరీ (ఫైల్)

అల్లిపురం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలు పూర్తయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన పునాదులపైనే నడుస్తోంది. అవే సచివాలయాలు, అవే రేషన్ వాహనాలు, అవే క్లాప్ వాహనాలు కనిపిస్తున్నాయి. వాటిని చూస్తే ఇంకా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే నడుస్తుందా అని భ్రమ కలుగుతుందనటంలో సందేహం లేదు.

పథకాల పేర్లు మార్చినా..

కూటమి ప్రభుత్వం పథకాలకు పేర్లు మాత్రమే మార్చింది. కానీ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలనే ఇప్పుడు కూడా వినియోగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రిక్రూట్ చేసిన సచివాలయ కార్యదర్శులతోనే వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. రేషన్ వాహనాలపై ఇంటింటికీ రేషన్ పంపుతున్నారు. వలంటీర్లకు మూటలు మోసే ఉద్యోగం అని విమర్శలు చేసిన కూటమి నేతలు ఆ తర్వాత వారిని వెనకేసుకు వచ్చి.. అనంతరం వారి ఉనికి కూడా లేకుండా చేశారు.

నాడు విమర్శించి.. నేడు ఉపయోగిస్తున్నారు..

తడి పొడి చెత్త తరలింపులో జగన్‌మోహన్ రెడ్డి యుద్ధ ప్రాతిపదికన క్లాప్ వాహనాలు కొనుగోలు చేసినప్పుడు విమర్శించిన వారే నేడు వాటిని చక్కగా వినియోగిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతలో క్లాప్ వాహనాల పాత్ర కీలకంగా మారింది. ఒకరు చేసిన మంచిని గుర్తించకపోయినా ఫర్వాలేదు. విమర్శించకుండా ఉంటే అంతే చాలు అని ప్రజలంతా అనుకుంటు న్నారు.

ఇప్పటికీ జగన్ మార్కే..

ప్రభుత్వం మారినా పాలనలో ఇంకా జగన్ మార్కే కనిపిస్తుందని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. అవే రేషన్ బండ్లు, అవే క్లాప్ వాహనాలు, పేర్లు మారినప్పటికీ పథకాలు మాత్రం అవే అని అంటున్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు సమయానికి పథకాలు అందేవి. ఇప్పుడు పథకాల పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి గాని అవి సరిగ్గా అమలు కావటం లేదని వాపోతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో లేకపోయినా అతని పాలనా మార్కు అలానే ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అదే పాలన..



ప్రభుత్వం మారినా అదే పాలన కొనసాగుతోంది. వీధుల్లో రేషన్ వాహనాలు చూస్తుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రాష్ట్రంలో పరిపాలనలో ఉందనిపిస్తుంది. జగన్‌మోహన్‌రెడ్డి తన మార్కు పాలనను పదిలంగా ఉంచుకున్నారు. ఆయన పెట్టిన పెట్టుబడి వృథా పోలేదు. ఆయన ఒరవడిలోనే అంతా జరుగుతోంది.

– జగన్నాథం ఈశ్వరమ్మ, అల్లిపురం

పింఛన్ విషయంలో జగనే బెటర్..



జగన్ చూపిన దారిలోనే కూటమి ప్రభుత్వం నడుస్తోంది. ప్రతి నెల వలంటీర్లతో తెల్లారక ముందే పింఛన్ అందించేవారు జగన్. ఆయన్ను దాటుకుని ఈ ప్రభుత్వం వెళ్లలేదు. ఆయన ఏర్పాటు చేసిన సచివాలయ సెక్రటరీలతో ప్రతినెల పింఛన్ అందజేస్తున్నారు. జగనే మెరుగు.

– కంఠం శ్రీనివాసరెడ్డి, కంఠంవారివీధి

పేర్లే మారాయి..



కూటమి ప్రభుత్వంలో పథకాల పేర్లు మాత్రమే మారాయి. పథకాలు జగన్ పెట్టినవే. జగన్ చెప్పిన సమయానికి లబ్ధిదారులకు నేరుగా పథకాలు అందజేసేవారు. సంక్షేమం విషయంలో అనుమానపడాల్సిన అవసరం లేకుండా పాలన సాగించారు.

– దుంప గుణవతి, బంగారుమెట్ట

పైపులైన్లకు మరమ్మతులు



వెలంపేటలో తాగునీటి పైపుకు మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ: ఎట్టకేలకు పాతనగరంలో తాగునీటి సరఫరాపై అధికారులు స్పందించారు. 'సాక్షి' దిన పత్రికలో 'మురుగు కాలువలో పైపులైన్లు.. తాగునీరు గరళం' అనే శీర్షికన వెలువడిన వార్తకు జీవీఎంసీ తాగునీటి విభాగం అధికారులు స్పందించారు. పాతనగరంలో మురుగు కాలువల్లో పైపుల ద్వారా సరఫరా అవుతున్న పైపులకు మరమ్మతులు చేయిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న పైపులను పూర్తిగా తొలగించి, రంధ్రాలైన పైపులకు వెల్డింగ్ ద్వారా మరమ్మతులు చేస్తున్నారు. శనివారం వెలంపేట వద్ద పైపుకు మరమ్మతులు చేయించారు.

కాటికాపర్లకు టీ షర్టుల పంపిణీ



కాటికాపర్లకు టీ షర్టులు అందజేస్తున్న యువసేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హరి

డాబాగార్డెన్స్: కాన్వెంట్ జంక్షన్ సమీపాన గల హిందూ శ్మశాన వాటికలో గల కాటికాపర్లకు యువసేవ ఫౌండేషన్ శనివారం టీ షర్టులు పంపిణీ చేసింది. జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గొలగాని ప్రసన్నకుమారి సహకారంతో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పీలా హరి ప్రసాద్ 20 మంది కాటికాపర్లకు వీటిని అందజేశారు.

విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించాలి



విద్యార్థులతో ముఖ్య అతిథులు ఎంపీ భరత్, డీఈవో ప్రేమ్‌కుమార్



అచ్చియ్యమ్మపేట స్కూల్లో విద్యార్థులకు యూనిఫారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధి పలు పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 39వ వార్డు ప్రభుత్వ క్వీన్ మేరీ పాఠశాల, ఎంవీడీఎం హైస్కూల్, డాబాగార్డెన్స్‌లో గల రమాదేవి భానోజీరావు జీవీఎంసీ పాఠశాల, 32వ వార్డు రైల్వే స్కూల్, 41వ వార్డు జ్ఞానాపురం పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మన బడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వానపల్లి గాయత్రి సారిపల్లి గోవింద్ పాల్గొన్నారు.

అచ్చియ్యమ్మపేట పాఠశాలలో..

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట పాఠశాలలో పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలన్నారు.

ఎంజీఎం హైస్కూల్లో..

ఎంజీఎం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వశంతలక్ష్మి పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌కేఎస్వీ నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లిపురం న్యూస్కూల్‌లో..

పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణలక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఆర్ శోభారాణి, ఎస్ఎంఎల్ మెంబర్ మంగ పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో రంగు రంగుల ముగ్గులు వేశారు.

జ్ఞానాపురంలో..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్–సేక్రెడ్ హార్ట్ ఎయిడెడ్ పాఠశాలలో శనివారం మెగా పేరెంట్ మీట్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశాఖ ఎంపీ భరత్, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ పాల్గొని వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులను సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఫొటో దిగి విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో బల్లిగిరి వెంకన్న

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష అలంకరణ తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో శ్రీదేవి, భూ దేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో విశేష అర్చనలు చేపట్టారు. సాయంత్రం స్వామివారికి కుంభ హారతి, ఏక హారతి నుంచి నక్షత్ర హారతి వరకు భక్తి శ్రద్ధలతో అందజేశారు.

పీడీఎస్ బియ్యం సరఫరా పరిశీలన



బియ్యం పంపిణీని తనిఖీ చేస్తున్న డీఎస్‌వో భాస్కరరావు

మహారాణిపేట: జిల్లా డీఎస్‌వో వి.భాస్కరరావు శనివారం కొబ్బరితోట ఏరియాలో బియ్యం సరఫరా చేస్తున్న ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. బియ్యం సరఫరా తీరుతెన్నులు, కార్డుదారులకు బియ్యం సకాలంలో అందుతున్నదీ లేనిదీ, కొలతల్లో తేడా ఏమైనా ఉందా అంటూ పరిశీలించారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడా పోటీలకు వైద్య విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్–2021 బ్యాచ్‌కి చెందిన సి. కరుణాకర్‌రాజు డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ తరఫున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ (పురుషుల) టోర్నమెంట్‌కు, యు. సూర్యతేజ టేబుల్ టెన్నిస్ (పురుషుల) టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, క్రీడల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. సునీల్‌కుమార్, ఎస్‌పీఎం విభాగాధిపతి డాక్టర్ ఎ. కృష్ణవేణి, వైద్య విద్యార్థులు కరుణాకర్‌రాజు, సూర్యతేజలను అభినందించారు. విద్యార్థులు రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు అన్నారు.

రిటైర్డ్ పోలీస్ అధికారికి డాక్టరేట్



రిటైర్డ్ పోలీస్ అధికారికి డాక్టరేట్ అందజేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: వివిధ రంగాల్లో నిష్ణాతులైన దేశంలోని 29 మందికి హర్యానా రాష్ట్రానికి చెందిన ఎంబీఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్లు శనివారం ప్రదానం చేసింది. హర్యానాలో యూనివర్సిటీ కాన్వకేషన్ హాల్లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో వీసీ సీపీ యాదవ్, సెనేట్ మెంబర్ డాక్టర్ గణగళ్ల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ అవార్డులు ప్రోత్సాహాన్ని ఇస్తాయని, సేవలకు తగిన గుర్తింపు లభించినప్పుడు మరిన్ని మంచి కార్యక్రమాలు చేసేందుకు దోహదపడుతుందన్నారు. రాష్ట్రానికి చెందిన రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖరరావు, సంఘ సేవకుడు కె. ఆదినారాయణ, రంగస్థల నటుడు నటరాజ్‌కు ఈ అవార్డులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలీవుడ్ యాక్టర్ డాక్టర్ మనోజ్ భాటియా, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సతీష్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే రోహిల్లా తదితరులు పాల్గొన్నారు.

కూలిన విద్యుత్ స్తంభం

సీతంపేట: డైమండ్ పార్కులో తుప్పుపట్టిన విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోయింది. దీంతో పార్కులోని సందర్శకులు, వాకర్లు ఆందోళనకు గురయ్యారు. అయితే ఎవరూ ఎటువంటి ప్రమాదానికి గురి కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి పునరుద్ధరించాలని వాకర్లు కోరారు.

నేడు కొండగుడి పండగ

పెద్ద ఎత్తున తరలి రానున్న భక్తులు



కొండగుడి ప్రధాన మందిరం



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: పాత పోస్టాఫీస్ వద్ద గల కొండగుడి (రోజ్‌హిల్స్)పై కొలువుదీరి భక్తులంతా కొలిచే తల్లి అమలోద్భవి (విశాఖపురి మేరీమాత). రోస్‌హిల్స్‌పై వెలసిన మేరీ మాత పుణ్యక్షేత్రం విశాఖపురికి ప్రత్యేక ఆభరణం. దీనినే 'కొండగుడి'గా భక్తులు పిలుచుకుంటారు. ఏటా డిసెంబరు 8వ తేదీన జరిగే కొండగుడి పండగకు హిందూ, ముస్లిం, క్యాథలిక్, క్యాథలికేతర క్రైస్తవులు అశేషంగా తరలివస్తారు. ఆదివారం వరకూ జపమాల, దివ్యపూజ, స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తారు. ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు.

నేడు నిర్వహించే పూజలు ఇలా..

వేకువ జాము 4.30 గంటలకు, తిరిగి 5.15, 6 గంటలకు దేవాలయంలో ఆంగ్లంలో దివ్యపూజ, ఉదయం 5, 6 గంటలకు గుహవద్ద తెలుగులో దివ్యపూజ, 7.30 గంటలకు గుహవద్ద తెలుగులో పొంటిఫికల్ దివ్యపూజాబలి నల్గొండ పీఠాధిపతి కరణం ధమన్ కుమార్‌చే నిర్వహించనున్నారు. ఉదయం 10, 11, 12 గంటలకు గుహవద్ద నూతన గురువులచే తెలుగులో దివ్యపూజ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు దివ్యసత్ప్రసాద ఆరాధన కార్యక్రమం, రాజమండ్రి విచారణ కర్త ఫాదర్ ఈగల రవీంద్రకుమార్‌చే దివ్యసత్ప్రసాద ఆరాధన ఏర్పాటు చేశారు. అనంతరం విశాఖపురి మేరీ మాత ద్వైమాస పత్రిక బైబిల్ క్విజ్, బైబిల్ పదకేళిలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారు. సాయంత్రం 5, 6 గంటలకు గుహవద్ద తెలుగులో దివ్యపూజ జరపనున్నారు.

ఉత్సాహంగా నాలెడ్జ్ హబ్ స్కోర్ ఫెస్ట్



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

అల్లిపురం: శ్రీ చైతన్య అకాడమీ నాలెడ్జి హబ్ స్కోర్ ఫెస్ట్ శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల నగరంలో 43 స్కూళ్ల నుంచి 12 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 22 మంది ఉత్తమ ర్యాంకు సాధించి ప్రతిభా స్కాలర్‌షిప్ పురస్కారం కింద నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీ చైతన్య ప్రాంతీయ అకడమిక్ డైరెక్టర్ నాగరాజు, ప్రాంతీయ బిజినెస్ హెడ్ జి. వేణుగోపాలరెడ్డి, క్లస్టర్ బిజినెస్ హెడ్ జి.విశ్వనాథ్, బ్రాంచ్ హెడ్ మద్దాల అరుణ్ స్వరూప్, అకడమిక్ హెడ్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వేడుకగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

అల్లిపురం: అస్సాంగార్డెన్స్‌లోని శ్రీ శివ రామకృష్ణ దేవస్థాన ప్రాంగణంలో కొలువైన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. సుబ్ర హ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని శైవాగమ సాంప్రదాయంలో, మంగళధ్వని, వేద మంత్రాలతో ఆలయ అర్చకుడు బులుసు సాయికృష్ణ శర్మ బృందం ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో దంపతులు పాల్గొన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ వాఖ్యానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం ఈవో రమాబాయి కల్యాణ దంపతులకు పట్టువస్త్రాలు అందజేశారు. ఆలయ సిబ్బంది కె. మన్మథ రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాల సాహిత్యంతో విజ్ఞానం.. వినోదం



మాట్లాడుతున్న రచయిత్రి కత్తి పద్మ

మహారాణిపేట: విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో అభ్యుదయ రచయితల సంఘం నిర్వహణలో బాల సాహిత్యంపై సాహితీ సభ జరిగింది. అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించారు. డాక్టర్ డి.వి. సూర్యారావు బాల సాహిత్యం పుట్టుపూర్వోత్తరాల గురించి వివరించారు. కొన్ని కథలు, గేయాలను ఉదహరించి వర్తమానంలో బాల సాహిత్యం ఎలా ఉండాలో పేర్కొన్నారు. పిల్లల్లో మానవీయ విలువలను రేకెత్తించేలా బాల సాహిత్యం ఉండాలన్నారు. హనుమంతరావు బాల సాహిత్యంపై రచయిత్రి కత్తి పద్మ విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. ఫణిశయన సూరి, అడపా రామకృష్ణ, చిన సత్యనారాయణ తదితర రచయితలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

కంచరపాలెం : అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. కంచరపాలెం పరిధి ఊర్వశి కూడలి దళిత సేన కార్యాలయంలో శనివారం రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ చూపిన మార్గం అనుసరణీయమన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 6వ రోజు శనివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి వీరిచే అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.